


www.vishalabharati.com
epaper:vishalabharati.com

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శనివారం | 04.05.2024 | హైదరాబాద్




# అప్పటికీ.. ఎప్పటికీ

# మెదక్ సేవకుడే

- బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థిగా మాజీ ఐఏఎస్ వెంకట్రామిరెడ్డి
- గెలుపే లక్ష్యంగా విలక్షణమైన రీతిలో బీఆర్ఎస్ ప్రచారం
- ట్రబుల్ షూటర్ హరీష్‌రావు తోడుగా ఎన్నికల సమరం
- మెదక్ అభివృద్ధికి రూ. వంద కోట్లతో ట్రస్ట్ ఏర్పాటుకు హామీ
- మాజీ కలెక్టర్ గెలుపునకు పార్టీ శ్రేణులు కృషి




**పుట్టింది సాదాసీదా రైతు కుటుంబమే. దేశానికి అన్నం పెట్టే రైతు కష్టాన్ని కళ్లారా చూసి పెరిగినా, ఆయన తండ్రి న్యాయవాది కావడంతో ఉన్నత ఆశయాలతో ఎదిగి 1996లో గ్రూప్ -1 అధికారయ్యారు. అంచలంచెలుగా ఎదుగుతూ ఐఎఎస్ స్థాయికి చేరారు. ప్రజా సేవకుడిగా మొదలుపెట్టిన ఆయన ప్రయాణం... ప్రభుత్వ ఉద్యోగాన్ని విరమించుకుని ప్రజా పాలనకు అంకితమయ్యేలా చేసింది. ఆయన అంకితభావం, ప్రజలకు మంచి చేయాలనే సంకల్పమే కేసీఆర్‌ను మెప్పించింది. ప్రభుత్వ ఉద్యోగిగా ఆయన సేవలను గుర్తించి ఎమ్మెల్సీగా ప్రజాక్షేత్రంలో నిలబెట్టింది. అక్కడితో ఆగిపోకుండా ప్రజాగొంతుకగా నిలిచేలా ప్రత్యక్ష ఎన్నికల్లో మెదక్ పార్లమెంట్ అభ్యర్థిగా ప్రోత్సహించింది. బీఆర్ఎస్ వ్యవస్థాపకుడు కేసీఆర్ ప్రజాయోగ్యమైన నిర్ణయంతో వెంకట్రామిరెడ్డిని ఢిల్లీ మెట్లను ఎక్కించనున్నారు. పదేళ్లు పాలించిన పార్టీని ఛిన్నాభిన్నం చేయాలని, ఒక్క గెలుపుతో విర్రవీగిపోతున్న కాంగ్రెస్ కుటిల ప్రయత్నాలకు, ఒంటెద్దు పోకడలతో దేశాన్ని పాలిస్తున్న కేంద్ర పార్టీలకు సరైన బుద్ధి చెప్పేలా... మెదక్ ఎంపీ అభ్యర్థిగా వెంకట్రామిరెడ్డిని నిలిపి ప్రత్యర్థులకు మాజీ సీఎం కేసీఆర్ చెమటలు పట్టిస్తున్నారు. ఈ ఎన్నికల్లో గెలుపు ఖాయమైందన్న రీతిలో ప్రచారంలో దూసుకుపోతున్నారు. హంగు ఆర్భాటాలతో ప్రజలకు చేరవ కాలేమని విశ్వసించి, ఎప్పటికీ తాను ప్రజాసేవకుడినేనంటూ ప్రచారాన్ని రక్తి కట్టిస్తున్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులకు తావే లేదన్నంటున్నట్లుగా ప్రజలతో మమేకమైతూ గెలుపు వైపు అడుగులు వేస్తున్నారు.**

**- విశాలభారతి / మెదక్**

## గ్రూప్ - 1 ఉద్యోగి స్థాయి నుంచి..

గ్రూప్-1 ఉద్యోగి స్థాయి నుంచి జిల్లా కలెక్టర్ స్థాయికి ఎదిగిన పి. వెంకట్రామిరెడ్డి స్వస్థలం పెద్దపల్లి జిల్లాయే అయినా... ఉద్యోగరీత్యా ఆయనకు మెతుకుసీమతో విడదీయలేని బంధం ఉంది. పాలకుడు ప్రజాక్షేత్రంలో ఉంటేనే ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని భావించిన ఆయనా... మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ ఆయన సొంతూరిని చేసింది. పార్టీ ఏ నిర్ణయం తీసుకున్న శిరోధార్యంగా భావించి పార్టీ కోసం సాధారణ కార్యకర్తల పనిచేసే కష్టపడేతత్వం ఢిల్లీకి చేరే వేదికనిచ్చింది. మెదక్ పార్లమెంట్ స్థానానికి ప్రధాన అభ్యర్థిగా నిలిచిన వెంకట్రామిరెడ్డికి ప్రజాక్షేత్రంలో సాగుతున్న ఎన్నికల పోరులో బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానాలను మరోసారి కైవసం చేసుకునేలా దూసుకుపోతున్నారు. ఓవైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కుట్రలతో మోకాలడ్డుపెడుతున్నా... ఆయన గెలుపుతో మెదక్‌లో బీఆర్ఎస్ కంచుకోట మరింత పటిష్టం చేసేలా ఎన్నికల సమరంలో దూసుకుపోతున్నారు.

## మెదక్‌తో 22 ఏళ్ల అనుబంధం..

1996లో గ్రూప్-1 అధికారిగా నియామాకం అయినా తర్వాత ఏపీలోని పలు ప్రాంతాల్లో పనిచేశారు. 2002లో తెలంగాణలో ఉమ్మడి మెదక్ జిల్లాకు డ్వామా పీడీగా నియమితులయ్యారు. 2007లో కన్ ఫర్డ్ ఐఏఎస్ హోదా పొందిన తర్వాత 2009లో మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ బాధ్యతలు నిర్వర్తించిన వెంకట్రామిరెడ్డి... ఆ తర్వాత 2014-16 సంయుక్త కలెక్టర్‌గా, 2016లో సిద్ధిపేట జిల్లా కలెక్టర్, 2020లో సంగారెడ్డి కలెక్టర్‌గా, ఆ తర్వాత సిద్ధిపేట్ కలెక్టర్‌గా పనిచేశారు. 2021లో స్వచ్ఛందంగా ఉద్యోగ విరమణ చేసి బీఆర్ఎస్ పార్టీలో చేరిన ఆయన.. ఎమ్మెల్యేల కోటా 2021లో ఎమ్మెల్సీగా నిలిచారు. పరిపాలన ప్రతినిధి నుంచి ప్రత్యక్ష ప్రజా పాలనలోకి పాలకుడిగా అడుగుపెట్టారు. కేసీఆర్‌తో తనకున్న సాన్నిహిత్యం ఆయనకు పార్టీలో కీలక బాధ్యతలను తెచ్చిపెట్టింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో మెదక్ జిల్లా నర్సాపూర్ అసెంబ్లీ స్థానానికి ఇన్ ఛార్జి బాధ్యతలు నిర్వహించి సునీతా రెడ్డిని గెలిపించడంలో ఆయన కీలకపాత్రను పోషించారు. దీంతో ఉమ్మడి మెదక్ జిల్లాలో ఉన్న 7 అసెంబ్లీ స్థానాల్లో ఆరింటిని బీఆర్ఎస్ గెలవగలిగింది. అలా 2002ను మెదక్ జిల్లాతో ఉన్న అనుబంధమే... ఇవాళ మెదక్ పార్లమెంట్ స్థానానికి ప్రాతినిధ్యం వహించే అవకాశం వచ్చిందని బీఆర్ఎస్ శ్రేణులు చెబుతున్నాయి. వెంకట్రామిరెడ్డిని వ్యూహాత్మకంగానే బీఆర్ఎస్ బరిలో దింపింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కంటే ముందు నుంచే మెదక్ జిల్లా బీఆర్ఎస్ పార్టీకి పెట్టని కోటలా మారింది. 2004లో అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల్లో మొదలైన బీఆర్ఎస్ గెలుపు పరంపర ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. ఈ క్రమంలో బీజేపీ నుంచి బరిలో ఉన్న రఘునందన్ రావు, కాంగ్రెస్ నుంచి గంపెడాశలు పెట్టుకుని, బీఆర్ఎస్‌ను నిలవరిస్తామంటూ చెబుతున్న నీలం మధుకు ధీటుగా ఈ స్థానంలో మాజీ కలెక్టర్ వెంకట్రామిరెడ్డిని బరిలో దింపడంలో కేసీఆర్ రాజకీయ చతురతను ప్రదర్శించారని విశ్లేషకులు చెబుతున్నారు. ఇప్పటికీ పార్టీ వ్యవహారాలన్నీ ఆయన కనుసన్నల్లో మాజీ మంత్రిగా, ట్రబుల్ షూటర్‌గా పేరొందిన హరీష్ రావు సారథ్యంలోనే ఎన్నికల ప్రచారం సాగుతుంది. దీంతో పార్టీలోనూ ఆయన గెలుపు నల్లేరుపై నడకలా మారుతుందని విశ్వాసంతో బీఆర్ఎస్ శ్రేణులు ఉన్నాయి.

## ప్రభుత్వ ఉద్యోగిగా కీలక బాధ్యతలు..

దాదాపు దశాబ్ద కాలంపాటు కలెక్టర్ హోదాలో ఉమ్మడి మెదక్ జిల్లాలో పనిచేసిన అనుభవం వెంకట్రామిరెడ్డికి ఉంది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మెదక్ జిల్లాను సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా చేపట్టిన ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుల నిర్మాణంలో ఆయన ముఖ్య భూమికను పోషించారు. సౌమ్యుడిగా ప్రజల అవసరాలు, ఆశయాలకు అనుగుణంగా వెంకట్రామిరెడ్డి కలెక్టర్ హోదాలో ప్రభుత్వ పాలన ఫలాలను అందించారు. రాష్ట్రంలోనే సిద్ధిపేట జిల్లాను రోల్ మోడల్‌గా తీర్చిదిద్దడంలో ఆయన చూపిన చొరవను ఇప్పటికీ మెదక్ ప్రజలు గుర్తు చేసుకుంటారు. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు నేతృత్వంలో జిల్లాలో రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండ పోచమ్మ రిజర్వాయర్ల నిర్మాణానికి భూసేకరణ చేయడంలో ఆయన కృషి ఎంతో ఉంది. మొదటిసారిగా 6వేల కుటుంబాలకు ఆర్అండ్ఆర్ కాలనీని ఆదర్శనీయంగా నిర్మించి తన పాలన నైపుణ్యాన్ని చాటుకున్నారు. ఇంటింటికి తాగునీరు అందించే మిషన్ భగీరథను సమర్థవంతంగా అమలు చేసి వందశాతం నీటి సరఫరా చేస్తున్న జిల్లాగా నిలిపారు. ఏండ్ల నాటి మెదక్ జిల్లా ప్రజల రైల్వే ప్రాజెక్టు కలను సాకారం చేయడంలో ముఖ్య భూమికను పోషించారు. 90శాతం మేర భూసేకరణ వివాదాన్ని సమర్థవంతంగా ఎదుర్కొని ప్రాజెక్టు పట్టాలెక్కేలా చేయడంలో ఆయన విశేషంగా కృషి చేశారు. పేద విద్యార్థులైన రాధా, రమణి అనే అనాథ పిల్లలకు ఆలనా పాలనా అన్నీ తానే చూస్తున్నారు. ఇన్నాళ్లు ప్రభుత్వ ఉద్యోగిగా, ఎమ్మెల్సీగా కొనసాగుతూ ప్రజలకు సేవలు అందిస్తూనే.. సామాజిక కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు దగ్గరయ్యారు. ప్రభుత్వ పథకాలు, సేవా కార్యక్రమాలను, వ్యూహాత్మక ప్రణాళికలను అమలు చేయడంలో సమర్థుడిగా పేరున్న వెంకట్రామిరెడ్డిని మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించడంలో కేసీఆర్ రాజకీయ వ్యూహాస్త్రాలలో ఒకటిగా బీఆర్ఎస్ ముఖ్యులు చెబుతున్నారు.






## ప్రజా సేవకే అంకితం..

తన అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసిన మాజీ సీఎం కేసీఆర్... తనను మెదక్ జిల్లా ప్రజా సేవకు అంకితం చేశారని వెంకట్రామిరెడ్డి చెబుతున్నారు. ఒక్క అవకాశంతో మెదక్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇస్తున్నారు. ఇప్పటికే సేవా కార్యక్రమాలు, ప్రభుత్వ పాలకుడిగా జిల్లావ్యాప్తంగా గెలుపే లక్ష్యంగా వెంకట్రామి రెడ్డి విశ్వాసం ఉన్నారు. తనను గెలిపిస్తే రూ. 100 కోట్లతో ట్రస్ట్ ఏర్పాటు చేసి సేవలను అందిస్తానని, పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న మెదక్ జిల్లాలో యువకులకు ప్రత్యేక నైపుణ్య శిక్షణను అందించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పెంపొందిస్తానని చెబుతున్నారు. తాను రాజకీయాల్లోకి సంపాదించుకునేందుకు రాలేదని, మొదటి నుంచి తన జీవితం ప్రజాసేవకే అంకితమైందన్నారు. తాను గెలిచిన వెంటనే 5ఏళ్ల అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలను అమలు చేసి... రూ. 100 కోట్లతో పేదలకు సేవలందిస్తానన్నారు. ఏటా రూ. 20 కోట్లతో పేద ప్రజలు, విద్యార్థుల చదువులకు ఖర్చు పెడతానన్నారు. ప్రతి నియోజకవర్గంలో రెండు కోట్ల చొప్పున అభివృద్ధి కార్యక్రమాలకు ప్రణాళికలను అమలు చేస్తానన్నారు.

## కేసీఆర్ దిశానిర్దేశం...

మరో ఏడేళ్లు ఎమ్మెల్సీగా కొనసాగే అవకాశం ఉన్నా... ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో మెదక్ బీఆర్ఎస్ స్థానానికి బలమైన, నిస్వార్థంగా పార్టీ, ప్రజల కోసం పనిచేసే నాయకత్వం కోసం చూసిన మాజీ సీఎం కేసీఆర్ వెంకట్రామిరెడ్డిని పార్లమెంట్ అభ్యర్థిగా ఎంపిక చేసుకున్నారు. ఏకగ్రీవంగా ఆయన అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసి జిల్లాలోని పార్టీ శ్రేణులకు గెలుపు కోసం దిశానిర్దేశం చేశారు. ఇప్పటికే ఆరు ఎమ్మెల్యేలతో పార్టీ బలంగా ఉన్న నేపథ్యంలో... హరీష్ రావు సారథ్యంలో మెదక్ పార్లమెంట్ గెలుపు సుసాధ్యమేనని చెబుతున్నారు. దుబ్బాక ఉప ఎన్నికలు మినహా ఎప్పుడూ గెలవనీ, రాజకీయంగా అపకీర్తి పొందిన రఘు నందన్ రావు బీజేపీ నుంచి బరిలో ఉన్నారు. ఓసారి ఎమ్మెల్యేగా గెలిచినా నియోజకవర్గానికి చేసిందేమి లేక తాజా అసెంబ్లీ ఎన్నికల్లోనూ మరోసారి ఓడిపోయి ఈసారి ఎంపీ బరిలో ఉన్నారు. కానీ మెదక్ జిల్లా అభివృద్ధిలో బీజేపీ ఏం చేసిందో చెప్పుకోలేని పరిస్థితుల్లో... ఉమ్మడి మెదక్ జిల్లాను అభివృద్ధి చేయడంలో కీలకంగా వ్యవహరించిన బీఆర్ఎస్‌కు ఆయన ఏమాత్రం పోటీయే కాదని విశ్లేషకులు చెబుతున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మెదక్ స్థానంపై భారీ ఆశలే పెట్టుకున్నది. కానీ ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో మెదక్ అభివృద్ధియే ప్రామాణికంగా, బీఆర్ఎస్ పదేళ్ల పాలను ప్రామాణికంగా తీసుకుంటున్నారు.

## సత్తువ లేని ప్రత్యర్థులు..

నిజానికి మెదక్ ఎంపీ అభ్యర్థిగా మాజీ కలెక్టర్ వెంకట్రామిరెడ్డిని నిలబెట్టడంతోనే ప్రత్యర్థి పార్టీలకు ఈ స్థానంలో అసలైన పరీక్ష మొదలైందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీల కంటే బీఆర్ఎస్ ఈ స్థానంలో బలంగా ఉంది. ఇప్పటివరకు వరుసగా ఐదు సార్లు గెలిచిన బీఆర్ఎస్ ఈసారి గెలుపుతో డబుల్ హ్యాట్రిక్‌పై దృష్టి పెట్టింది. మరో ఐదేళ్లు కాంగ్రెస్, బీజేపీలకు ఈ స్థానంలో చోటే లేదని చెప్పడమే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రచారంలో దూసుకుపోతుంది. నిజానికి ఈ స్థానంలో ట్రయాంగిల్ పోటీ ఉంటు ందని అంతా అంచనా వేస్తున్నారు. కానీ పటాన్‌చెరు నుంచి బీఎస్పీ అభ్యర్థిగా ఓడిన నీలం మధు ఈసారి కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేయడం, ఆ నియోజకవర్గానికే పరిమితమైన ఆయన ఛరిస్మాతో ఉమ్మడి మెదక్ జిల్లాలో బరిలో నిలిచి నానా అవస్థలు పడుతున్నారు. కేవలం ముదిరాజ్ ఓటర్లను నమ్ముకుని ప్రచారం చేస్తుండగా... సొంత వర్గం ఆదరణనే పొందలేకపోతున్నారు. అదే సమయంలో బీసీల్లోని మిగతా కులాలకు దూరం చేసుకున్నారు. ఆరు స్థానాల్లో బలంగా ఉన్న బీఆర్ఎస్ నుంచి గట్టి పోటీని ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఇక మెదక్ ఎంపీ స్థానాన్ని బీఆర్ఎస్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. అందుకు తగినట్లుగానే ట్రబుల్ షూటర్‌కు వెంకట్రామిరెడ్డి గెలుపు బాధ్యతను అప్పగించింది. ఉడుము పట్టు హరీష్ రావు సారథ్యంలో బీఆర్ఎస్ అభ్యర్థి దూసుకుపోతున్నారు. కేవలం మోదీ ఛరిస్మానే నమ్ముకుని ఎన్నికల్లో అడుగుపెట్టారు బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు. ఓసారి దుబ్బాక ఎమ్మెల్యేగా గెలిచినా... ఆయన నియోజకవర్గానికి చేసిందేమి లేకపోవడం, కనీసం కేంద్రం నుంచి ప్రత్యేక నిధులను తీసుకురావడంలోనూ ఆయన వైఫల్యం చెందడం, మెదక్ ఎంపీగా గెలిచేందుకు మాత్రమే ఓట్ల కోసం మెదక్ జిల్లా వాసినంటూ ప్రచారం చేసుకోవడం తప్పా... ఆయన ఎన్నికల ప్రచారం ఏమాత్రం ప్రభావం చూపులేకపోతున్నది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు నియోజకవర్గాల్లో మూడో స్థానానికే బీజేపీ పరిమితమైంది. ఇక బీఆర్ఎస్ - కాంగ్రెస్ మధ్య పోటీ ఉంటు ందని చెబుతున్నా... బీఆర్ఎస్‌కు గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఓటర్లు చెబుతున్నారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడిచినా.. ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో రేవంత్ రెడ్డి సర్కారు విఫలమయ్యారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని నీలం మధుకు మద్దతునిస్తున్నా.. క్షేత్రస్థాయిలో అందుకు భిన్నమైన పార్టీ పరిస్థితులను కాంగ్రెస్ ఎదుర్కొంటుంది. అదేవిధంగా రాజకీయంగా ఎలాంటి అనుభవం లేని నాయకుడిని ఆ పార్టీ ఎంపిక చేసుకోవడం వంటి అంశాలు బీఆర్ఎస్ పార్టీకి కలిసి వచ్చేలా ఉన్నాయి. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం రావడానికి మల్లన్నసాగర్ భూసేకరణ అంశాన్ని రాజకీయం చేసి లబ్ధి పొందాలనే చూస్తుంది.

